జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఉద్యమిద్దాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, డస్క్ జర్నలిస్టులకు, గత ప్రభుత్వాలు ఇళ్ల స్థలం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాయని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ వర్కింగ్ జర్నలిస్టులు మరో అడుగు ముందుకు వేశారు. సీనియర్ జర్నలిస్టులు ఆర్.రామ చంద్రరావు, బి.రవికాంత్, పి.రామకృష్ణ, రాఘవేందర్ రెడ్డి, వి.సత్యనారాయణ, జి.జనార్ధనరావు, డి.రవి కుమార్, శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జీవీఎంసీ సెల్లార్‌లో జర్నలిస్టులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఇంత కాలం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు లేకపోవడంతో సీనియర్ల ఆధ్వర్యంలో పోరాటం చేసేందుకు జర్నలిస్టులంతా కలసి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి జర్నలిస్ట్‌లకు 2 నుండి 3 సెంట్ల ఇంటి స్థలం వచ్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాల ద్వారా తమ అభ్యర్థులను తెలియజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. 2005 జర్నలిస్టుల కు దాదాపు ఇళ్ల స్థలాలు వస్తాయని, ఇన్నాళ్లు చాలామంది కావాలనే ఇళ్ల స్థలాలు రాకుండా అడ్డుకున్న ప్రయత్నాలు చేశారని, ఇక 2006 నుండి ఇప్పటివరకు పనిచేస్తున్న అక్రిడేషన్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్‌తో పోరాటాన్ని ఉధృతం చేస్తామని తీర్మానించింది. గతంలో ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసిన సొసైటీలు అన్ని కలిసి ఉమ్మడిగా ఒకే సొసైటీ వేదికగా ఇళ్ల స్థలాల సాధన కోసం నూతన సొసైటీ ఏర్పాటు చేసి ఉద్యమిద్దామన్నారు. జిల్లా కలెక్టర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి అంగీ కారం ఇచ్చారని, 200 గజాల నుండి 300 గజాల వరకు స్థలం వచ్చే వరకు పోరాడుదామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్‌లు కోయిలాడ పరుశురాం, శిరీష, విజయ లక్ష్మి, ఆలపాటి శరత్ కుమార్, రఫీ, ఎస్.వి.బి.కుమార్, సిద్ధు, రాజ్ కుమార్, కె.చంద్ర మోహన్, రమేష్ బొప్పన, ఆంధ్ర పథం శ్రీనివాస్, ఎస్.చంద్ర శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ 25వ వార్డు పరిధిలోని మధురానగర్ సర్వే నంబర్ 12లో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని కూల్చి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. విశాఖ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నున్న మల్లేష్, నున్న శంకర్ అనే ఇద్దరు భూకబ్జాదారులు సుమారు 130 గజాల విలువైన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పక్కా భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో గతంలో వైసీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె కె రాజు, స్థానిక కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఈ స్థలాన్ని పరిశీలించి అది రజకుల పక్కా గెడ్డ పోరంబోకు స్థలమని, దానిలో ఎటువంటి కట్టడాలు అక్రమంగా నిర్మించరాదని తెలియజేయడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మార్వోకి స్థానిక రజకులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎమ్మార్వో స్థలాన్ని పరిశీలించి అది రజకులు వారి కులవృత్తి చేసుకునే ధోబి ఘాట్ స్థలంగా నిర్ధారించి, అది ప్రభుత్వ స్థలమని దానిలో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని, వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక సచివాలయ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. నిర్మిస్తున్న భవనాన్ని జీవీఎంసీ సిబ్బంది కూల్చి వేసారని తెలిపారు. ఆక్రమణదారులు మరలా ఈ మధ్య కాలంలో భవనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో స్థానికంగా ఉన్న రజకులు సి.పి.ఐ పార్టీని సంప్రదించారని తెలిపారు. స్థానికులతో కలిపి సి.పి.ఐ. ప్రతినిధి బృందం స్పందనలో ఆగస్టు 28న జెసికి ఈ అంశంపైన వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. జేసీకి ఫిర్యాదు చేసిన తర్వాత జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది బిల్డింగ్ కూల్చడానికి వచ్చి, అరగంట పాటు అక్కడే వేచి ఉండి పగలగొట్టకుండా తిరిగి వెళ్లిపోయారని అన్నారు. జీవీఎంసీ యంత్రాంగం తక్షణమే స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి భూ ఆక్రమణకు పాల్పడిన నున్న శంకర్రావు, నున్న మల్లేష్ అనే ఇద్దరు భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విలేకరుల సమావేశంలో సి.పి.ఐ ఉత్తర నియోజకవర్గం కార్యదర్శి పి.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి నెయ్యల నాగభూషణరావు, స్థానిక రజకులు కోనేటి లక్ష్మి, కోనేటి నూకరాజు, కోరబిల్లి సంతోష్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ అమలును జిల్లా జాయింట్ కలెక్టర్ కెయస్ విశ్వనాథన్ క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. గురువారం జీవీఎంసీ జోన్ 3 పరిధిలో వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయంలో ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లు చేవడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను, దివ్యాంగులను, ట్రాన్స్‌జెండర్‌లను ఓటర్లుగా నమోదు చేయాలని అన్నారు. ఈ తనిఖీలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, బూత్ స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

పాఠశాల భవనం నిర్మించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: నాడు నేడుతో పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ మన్యంలో చాలాచోట్ల పాఠశాల భవనాలు లేవని మాజీ సర్పంచ్ కొండలరావు అన్నారు. వేంగడ పంచాయతీ డొంకపుట్టులో పాఠశాలలో మూడు గ్రామాలకు చెందిన 75 మంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారని అయితే పాఠశాల భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నగుడిసెలో పాఠశాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. వర్షం పడితే పిల్లలు తడిసి ముద్దవుతున్నారని, పాఠశాల భవనమైనా నిర్మించాలని లేదా సెలవులు ప్రకటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ చింతల నారాయణమూర్తి నాయుడు అనారోగ్యంతో గురువారం విశాఖపట్నం ప్రైవేట్ హాస్పిటల్లో మృతి చెందారు. నిత్యం ప్రజలతో మమేకమై ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి నాయకుడు మా మధ్య నుండి దూరమయ్యారని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి పలువురు ఘన నివాళులర్పించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల అగ్నిమాపక అధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఫైర్ విన్యాసాలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాజేశ్వరరావు, లీడింగ్ ఫైర్ మాన్ శ్రీను, పిఎస్ఎస్ వర్క్ ఫైర్ మాన్ మణికుమార్, వరహాలు పాల్గొన్నారు.

పెట్రోల్ కొలత తేడాతో వివాదం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని సాయిరాం ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్ లో గురువారం రాత్రి వివాదం చోటు చేసుకుంది. పెట్రోల్ తేడా కొట్టడంతో వాహనదారులు పనిచేస్తున్న వారిని నిలదీశారు. పట్టణానికి చెందిన కాకర నూకరాజు అనే వ్యక్తి పెట్రోల్ కోసం బంక్ కు వచ్చాడు. 200 రూపాయలు చెల్లించి వాహనంలో పెట్రోల్ కొట్టించుకున్నాడు. పెట్రోల్ కొట్టడం త్వరగా పూర్తి కావడంతో అనుమానం వచ్చి బండిలో ఉన్న పెట్రోల్ అంతా బాటిల్లో బయటకు తీశారు. బయటకు తీసిన పెట్రోల్ తక్కువగా ఉండటంతో పెట్రోల్ కొట్టిన వ్యక్తిని నిలదీశారు. ఈ విషయమై వివాదం చోటు చేసుకుంది. 200 రూపాయలకు పెట్రోల్ తేడా వస్తే ప్రతిరోజు ఎంత తేడా చేస్తున్నారంటూ వాహనదారులు సిబ్బందిని, బంకు యజమానిని నిలదీశారు. పెట్రోల్ తేడా కొట్టంపై బంకు యజమాని రఘురాం పెట్రోల్ కొట్టిన వ్యక్తిని నిలదీశారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని బాధితులు తెలిపారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

విశాలాంధ్ర - కశింకోట: స్థానిక రాజీవ్ గాంధీ ఆర్.ఈ.సి.స్ పాలిటెక్నిక్‌లో 50 శాతం అడ్మిషన్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహి స్తామని కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ తెలియజేసారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని తెలిపారు. కళాశాలలో 4 బ్రాంచి లు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఉన్నాయని, ఒక్కో దానిలో 30 సీట్లు చొప్పున వుంటాయని తెలిపారు. ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి ఫీజు రీయంబర్సుమెంట్, స్కాలర్ షిప్‌లు వర్తిస్తాయని తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ వ్యవహరిస్తారని తెలిపారు.

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - మల్కాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీ విజ్ఞాన మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నగర మేయర్ గొలగాని వెంకట కుమారి, పశ్చిమ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పివి గణబాబు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా హిమాచల్ నగర్, గాజువాక డిపో సమీపాన గల ములగాడ ఎంఆర్ఓ ఆఫీస్ కార్యాలయం వద్ద, నక్కవానిపాలెం, వెంకన్నపాలెం ప్రాంతాల్లో గల యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

కోతుల బారి నుంచి రక్షించండి

విశాలాంధ్ర - అడ్డతీగల: మండలంలో కోతుల బెడద చాలా తీవ్రంగా ఉంది. ఇళ్లల్లోకి చొరబడి తినుబండారాలను తీసుకువెళ్లి మనుషులపై దాడికి దిగుతున్నాయి. మైదాన ప్రాంతాల నుంచి పెద్దఎత్తున కోతులను తీసుకువచ్చి ఇక్కడ విడిచిపెడుతున్నారు. అధికారులు స్పందించి కోతుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మురళి పట్టిన ముద్దు కృష్ణుడు

విశాలాంధ్ర - జీకే వీధి: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మన్యంలో ముద్దులొలికే చిన్నారులు మురళి చేపట్టి శ్రీకృష్ణుడి వేషధారణలో ఆహుతులను అలరించారు. వివిధ గ్రామాలలో వారి వారి తల్లిదండ్రులు చిన్నారులను ఈ విధంగా కృష్ణుడి వేషధారణలో తయారు చేయడమే గాక, శ్రీకృష్ణుడిని రూపాన్ని తమ చిన్నారులలో చూసి మురిసిపోయారు.

చిరుధాన్యాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - హుకుంపేట: పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలపై అవగాహన అవసరమని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించిన పోషకాహార మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలు వాడడం వలన అధిక రక్తపోటు, చక్కెర వ్యాధులను నిలకడగా ఉంచుతుందని అన్నారు. చిరు ధాన్యాలు పంటను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని లేకపోతే చిరు ధాన్యాల పంటలు అంతరించిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ బాల చంద్రామణిదేవి, స్థానిక సర్పంచ్ సమిడ వెంకట పూర్ణిమ, అంగన్వాడి సూపర్వైజర్లు, గ్రామ మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: అరకులోయ పట్టణ పరిధిలో గల ఎండపల్లి వలస గ్రామంలోని నిరుపేద మహిళలకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి గురువారం చీరలను పంపిణీ చేసి ఉదారత భావాన్ని చాటుకున్నారు. కరోనా వ్యాప్తి మొదలుకుని నాటి నుండి నేటి వరకు ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ నిత్యావసర సరుకులు పంపిణీ, చీరలు పంపిణీ చేస్తుండడం అభినందనీయమని గిరిజనులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు, గ్రామ మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

రూ.13 కోట్లతో నూకాంబిక అమ్మవారి ఆలయ ఆధునీకరణ

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పున:నిర్మాణ పనులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా ఉన్న సమయంలో వైవీ సుబ్బారెడ్డి మూడు కోట్ల రూపాయలు మంజూరు చేసి, కోటిన్నర రూపాయలు ఇప్పటికే విడుదల చేశారని, మొత్తం కూడా త్వరలోనే అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి కూడా ఆమోదం తెలియజేసిందని మంత్రి అమర్నాథ్ చెప్పారు. గురువారం ఉదయం అమ్మవారి ఆలయానికి చేరుకున్న అమర్నాథ్ దంపతులను ఆలయ చైర్మన్ కొణతాల మురళి, ఈవో తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి అమర్నాథ్‌కు పరివేట్టం చుట్టి అమ్మవారి గర్భాలయంలోకి మంత్రోచ్ఛరణలతో తీసుకువెళ్లారు. అమ్మవారి మూలవిరాట్ దర్శనాన్ని గురువారం నుంచి నిలిపివేయనున్నారు. కాగా, ప్రధానాలయం మూసివేసి, భక్తులు దర్శనం కోసం బాలాలయంలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉగాది నాటికి ఆధునీకరణ పనులు పూర్తిచేసి అమ్మవారి దర్శనాన్ని భక్తులకు కల్పిస్తామని చెప్పారు.

అధిష్టానం అవకాశం కల్పిస్తే ఎన్నికల్లో పోటీ చేస్తా

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ అధిష్టానం అవకాశం కల్పిస్తే పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన తాను విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి విశాఖపట్నంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నట్టు తెలిపారు. ఇప్పటికే వలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన తాను, త్వరలో పాయక రావుపేట నియోజవర్గంలో వలు సేవా కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తానని తెలిపారు. వైసిపి రాష్ట్రస్థాయి నాయకులు ప్రోత్సాహంతో నియోజవర్గంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలని తాను ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నట్లు తాడి ప్రకాష్ రత్నం తెలిపారు.

రామవరంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని రామవరం గ్రామంలో నమ్మి జగదీష్ మొదటి వర్ధంతి సందర్భంగా న్యూ ట్రెండింగ్ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంలో 30 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, ఎంపీటీసీ గొలగానికృష్ణ, సర్పంచ్ వై.పైడిరాజు, రక్తదానం చైతన్య కర్త వి వినోద్, బాలు, వి.వినోద్, బాలు, చత్రపతి, శివాజీ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, న్యూ ట్రెండింగ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పంచ గ్రామాల సమస్య పరిష్కారమయ్యేనా....?

విశాలాంధ్ర - సింహాచలం: కొద్ది రోజులలో లేదా కొన్ని నెలల్లో పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అని చెప్పిన వైయస్ జగన్మోహన్ ప్రభుత్వ హామీ ఏమైందని ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పంచ గ్రామాలైన 'అడివివరం, వెంకటాపురం, వేపగుంట, పురుషోత్తపురం, చీమలాపల్లిలో ఉన్న 17 జీవిఎంసి వార్డులు, 5 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సుమారు లక్ష మందికి పైగా ప్రజానీకం ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కొద్ది రోజులలో లేదా కొన్ని నెలల్లో పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అని చెప్పిన, నాలుగు సంవత్సరాల 'మూడు నెలలు పూర్తి అయిన ఇప్పటికి పరిష్కారం కాలేదన్నారు. ఇళ్ళ నిర్మాణాలు, రిపేర్లు సైతం అనుమతించక పోవడం అమానవీయమని అన్నారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఇళ్ళ రిపేర్లు చేసుకోవచ్చని పలుమార్లు తెలిపారని అయితే ఆచరణలో దేవస్థానం సిబ్బంది దీనిని అడ్డుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమానికి బి.రమణి అధ్యక్షత వహించారు. టీవి ఏవీ కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, విబిఎన్.ప్రతాప్, బి.అరుణ్ కుమార్, కోటేశ్వరరావు, ఎస్.రాజు, ఎన్వీ రమణ, వి.నారాయణరావు, కృష్ణారావు, బి.శంకర్రావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణకు పైలా విరాళం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలం గుల్లిపల్లి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో మాడుగుల నియోజకవర్గం టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు రాళ్లపల్లి దేముడు, ఎంపీటీసీ కసిరెడ్డి దేముడు బాబు, తంగేటి శ్రీను, కడుపుట్ల గంగరాజు, యాదవ సంఘం అధ్యక్షులు డొప్ప ఎర్రిబాబు, సీముసురు నూకరాజు, బోను గంగునాయుడు, వియ్యపు దేముళ్ళు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్ర ముగింపు సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చోడవరం: కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా సీపీఐ చేపడుతున్న సీపీఐ బస్సు యాత్ర ముగింపు సభ జయప్రదం చేయాలని సి.పి.ఐ. జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పాత బస్టాండ్‌లో గురువారం ఓ కరపత్రాన్ని విడుదల చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పార్వతీపురం నుండి తిరుపతి వరకు బస్సు ద్వారా ప్రచారం చేసి, ముగిస్తున్న సందర్భంగా ఈనెల 8వ తేదీన ప్రజా బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదంతో కార్మిక వర్గాలు ఏడాదికి పైగా ఆందోళన చేస్తుంటే ముఖ్యమంత్రి కనీసం స్పందించకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వర ప్రసాదు, దేవుడు, కొండబాబు, పైడి బాబు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణుడు విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - పరవాడ: నాయుడుపాలెం శివారు గొల్లపేటలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీ కృష్ణుడు విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంపీలు మాసవరపు అప్పలనాయుడు, మాదంశెట్టి నీలబాబు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వియ్యపు చిన్నా, కూండ్రపు శ్రీరామ్మూర్తి, సారిపల్లి జోగి నాయుడు, కర్రి అప్పలరాజు, జిల్లా యాదవ సంఘం నాయకులు సారిపల్లి నేస్తాలు, సారిపల్లి సోమి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీను అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. గంజాయి సాగు పండించడం, రవాణా చేయటం, మధ్యవర్తులుగా వ్యవహరించడం పనులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గంజాయి పూర్తిగా నిర్మూలించాలని ఆయన పెద్దలకు సూచించారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు తాము సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

గీతంలో ఓపెన్ స్కూల్ కార్యక్రమం

విశాలాంధ్ర - మధురవాడ: సైన్స్ కోర్సుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచడంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ తరువాత గల విద్యావకాశాలు, పరిశోధకులుగా మారాలంటే చేయాల్సిన కృషి అలాగే ఆసక్తి కలిగించే విజ్ఞాన శాస్త్ర వింతలను తెలియ చెబుతూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా ఓపెన్ స్కూల్ పేరిట సరికొత్త కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ దేశంలో శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు పెరుగుతున్నాయని, చంద్రయాన్ వంటి ప్రయోగాలు విజయవంతం కావడం వెనక శాస్త్రవేత్తల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేధవతి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొన్నారు.

గవర్నర్ అరకు పర్యటన రద్దు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అరకు వ్యాలీ పర్యటన అనివార్య కారణాల వలన రద్దయిందని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ గురువారం వెల్లడించారు. అలాగే ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్.జవహర్ రెడ్డి పాడేరులో పర్యటిస్తారని తెలిపారు. అల్లూరి సీతా రామ రాజు జిల్లా అధికారులు, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో సమీక్షిస్తారని చెప్పారు.

నిక్సన్‌కు ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగ పరిశోధక విద్యార్థి నున్న నిక్సన్‌కి ఏయూ డాక్టరేట్ లభించింది. "ప్రాబ్లమ్స్ ఆఫ్ గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్ ఇన్ సెకండరీ స్కూల్స్ (ఏ స్టడీ ఇన్ రూరల్ ఏరియాస్ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ ఆంధ్రప్రదేశ్) అనే అంశంపై పరిశోధనలు చేసినందుకుగాను ఆయన డాక్టరేట్ పొందారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా నిక్సన్ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. సోషల్ వర్క్ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ కె. విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు.

మండల ప్రజా పరిషత్ నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర - పెదబయలు: మండల ప్రజా పరిషత్ నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతుల మీదుగా ప్రారంభించారు. మండల పరిషత్ నూతన కార్యాలయ భవనానికి 2008వ సంవత్సరంలో శంకుస్థాపన చేయగా 2023వ సంవత్సరంలో మొదటి గ్రౌండ్ ఫ్లోర్ భవన పనులను పూర్తి చేసి గురువారం ప్రారంభించారు.

గతంలో 2008వ సంవత్సరంలో 85 లక్షల అంచనా విలువలతో భవనము మొదలుపెట్టగా ప్రస్తుత ధరలతో పూర్తి చేయలేరని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా గ్రౌండ్ ఫ్లోర్‌కు సంబంధించి జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు 14.95 మంజూరు చేశారు. దీంతో భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ అంతస్తు మీటింగ్ హాల్ నిర్మించుటకు సహకరిస్తానని తెలిపారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గత 15 సంవత్సరములుగా అసంపూర్తిగా ఉన్న మండల ప్రజా పరిషత్ భవనమును పూర్తి చేయుటకు ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులతో పూర్తి చేసి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రెండవ అంతస్తుకు సంబంధించి భవన నిర్మాణం కొరకు తన వంతుగా శాసనసభ్యుల నిధుల నుండి పది లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్టుగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణయ్య, స్థానిక తహశీల్దార్ కృష్ణారావు, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొండయ్య పడాల్, మాజీ మండల ఇంజనీరింగ్ అధికారి సంజీవరావు, ఇంచార్జ్ మండల ఇంజనీరింగ్ అధికారి శివరాం, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు, స్థానిక సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీలు ఫోరం అధ్యక్షుడు కే.బొంజుబాబు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సురేష్, వైసీపీ నాయకులు వంతల ఆనందరావు, గంపరాయి సూరయ్య, కొర్ర రాజబాబు, పాంగి సింహాచలం, అజయ్ కుమార్, కాంట్రాక్టర్ లోట్టి గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ

పత్రికా ప్రకటన

VMRDA-LAYOUT/APDPMS No.1167/0058/LP/VMRDA/2023, తేది. 28-08-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునదేమనగా విజయనగరం జిల్లా, కొత్తవలస మండలం, చీపురువలస గ్రామం నందలి సర్వే సంఖ్యలు 39/6p, 7p, 8p, 10p, 11, 12p, 15p & 40/2p లో ఎకరములు 4.1576 సెంట్లు గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము శ్రీ కోనేరు నాగేశ్వరరావు & లంకా నవీన్ కుమార్ దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఆన్‌లైన్ ఫైల్ నెం. 1167/0058/LP/VMRDA/2023 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

అంధకారంలో చోడవరం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తామర చెరువు ప్రాంతంలో ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తులకు గురి కావడంతో తామర చెరువు ప్రాంతంతో బాటు సకురు వీధి, విశ్వబ్రాహ్మణ వీధి, చిన్న వెలమ వీధి ప్రాంతాల్లో సుమారు 30 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తాజాగా కోఆపరేటివ్ కోలనీ లోని వెంకటేశ్వర కళ్యాణ మండపం వద్ద ట్రాన్స్ ఫార్మర్ మరమ్మత్తులకు గురి కావడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు త్వరగా మేల్కొని ప్రజలకు కరెంట్ కష్టాలు తీర్చవలసిందిగా మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గిరిజన ద్రోహి సీఎం జగన్

విశాలాంధ్ర - కొయ్యూరు : నమ్మి రెండుసార్లు అధికారాన్ని కట్టబెట్టిన గిరిజన ప్రజలను మోసగించిన గిరిజన ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్ విమర్శించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కనీసం మచ్చుకైనా కాన రాలేదన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, విద్యా వైద్యం త్రాగునీరు రహదారులు రవాణా వంటి కనీస సౌకర్యాలు గిరిజనులకు అందని ద్రాక్ష గానే మిగిలాయని ఆరోపించారు. చింతపల్లిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తిగా పడకేసిందని, పాడేరు లో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ఈ ప్రభుత్వ హయాంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. మన్యంలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు నామినేటెడ్ పదవుల చైర్మన్ లకు కూడా ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ దొరకని పరిస్థితి నెలకొందని విమర్శించారు.

ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ గణనీయమైన వృద్ధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎఫ్ వై 2020 నుండి ఎఫ్ వై 2023 వరకు దాని హామీ ఇవ్వబడిన పొదుపు ఉత్పత్తుల (గ్యారెంటీడ్ సేవింగ్స్ ప్రొడక్ట్స్) విభాగంలో 158 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వినోద్ హెచ్ తెలిపారు. స్టాక్ మార్కెట్లలో పెరిగిన అస్థిరత కారణంగా గ్యారెంటీ ప్రయోజనాలను అందించే ఉత్పత్తుల వైపు కస్టమర్ ప్రాధాన్యత మళ్లిందన్నారు. గ్యారంటీడ్ బెనిఫిట్ ప్రొడక్ట్స్ మూలధన భద్రతను అందిస్తాయన్నారు. స్థిరమైన రాబడిని అందిస్తాయన్నారు. ఈ ఉత్పత్తుల వర్గం ఆర్థిక స్థిరత్వాన్ని ద్వితీయ ఆదాయ మూలాన్ని నిర్మించడానికి సాధ్యమయ్యే మార్గాన్ని అందిస్తుందన్నారు.

గర్భిణీల్లో రక్తహీనత నివారణా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో గర్భిణీలలో రక్తహీనతను నివారించే విధంగా రోజువారీ ఆహారంలో విటమిన్లు సమృద్ధిగా ఉండేలా వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి అన్నారు. గురువారం సి.ఎస్ క్యాంపు కార్యాలయం నుంచి వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం వంటి అంశాల పురోగతిపై జిల్లాల వారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సి ఎస్ జిల్లాలలో నాడు నేడు కింద నిర్వహిస్తున్న పనుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు

విశాలాంధ్ర - అనంతగిరి: విశాఖ అరకు ఘాట్ రోడ్‌లో ట్రాఫిక్ జాం అయింది, అనంతగిరి మండలంలో గల శివలింగపురం తైడా గ్రామాల మధ్య గల రెండో నెంబర్ వద్ద భారీ వాహనం ఇంజన్ లోపంతో ఆగిపోయింది. అటు కిలోమీటర్లు వరకు ఇటు కిలోమీటర్ వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారుగా రెండు గంటలు ఈ ట్రాఫిక్ జామ్‌లో వాహనదారులు ఇరుక్కున్నారు. తర్వాత పోలీసు వారు వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఉపాధి అవకాశాలు లేకనే వలసలు



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో మానవ వనరుల అభివృద్ధి జరగడం లేదని, ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వలస పోతున్నారని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టఫర్ విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జూడో యాత్ర మొదలుపెట్టి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా యువజన నాయకత్వ శిబిరాలు జరుగుతాయని, యువత ఐక్యత కోసం దోహదం చేసే చేపడతామని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అయిపోతున్నాయన్నారు. బీజేపీ విధానాలు ప్రచార ఆర్భాటం మాత్రమే అని దుయ్య బట్టారు. మీడియా సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు భగత్, శిరీష్, చినబాబు, మనుకుమార్, శివ, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నిర్వాసిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటాం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: నిర్వాసితులు నష్టపోకుండా, నిర్వాసిత కుటుంబాలను సర్వే చేసి అందరికీ తగిన న్యాయం జరిగేలా చూస్తామని రంపచోదరం నియోజకవర్గ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని యంపిడిఓ కార్యాలయం అవరణలో గురువారం పోలవరం ముంపునకు గురవుతున్న నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఇంటి పట్టా పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లడుతూ మన ఈ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. మొత్తం నూతనంగా మంజూరైన 259 పెన్షనర్లకు 2750 రూపాయలు చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్. పురం మండల కన్వీనర్, ఎంపీపీ ,జడ్పిటిసి ,వైస్ఎంపీపీలు, ఎంపీటీసీలు, సొసైటీ ప్రెసిడెంట్, వివిధ కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ కోఆప్షన్ నెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు గృహసారదులు, ఎక్స్ సర్పంచ్లు ఎక్స్ ఎంపిటిసిలు,ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - పెదబయలు: యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పూర్ణయ్య అన్నారు. గురువారం ఉపాధి హామీ కార్యాలయంలో 100 రోజులు పని పూర్తి చేసిన జాబ్ కార్డు వేతనదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వత సొసైటీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళా 23 గ్రామ పంచాయతీల ఉపాధి హామీ జాబ్ కార్డు యొక్క లబ్ధిదారుల యువతి యువకులు కార్యాలయము నందు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ అధికారి ఎల్.పూర్ణయ్య మాట్లాడుతూ పదవ తరగతి నుండి డిగ్రీ పూర్తి చేసిన యువతి యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించుటకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు మేరకు డేటా ఆపరేటర్స్ కంప్యూటర్స్, పిట్టర్ వెల్డర్ తదితర విభాగాలకు ఉపాధి హామీ పథకం ద్వారా శిక్షణ కలిగిన ఆయా జిల్లాలు విశాఖపట్నం అనకాపల్లి నర్సీపట్నం జిల్లా స్థాయిలలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. శిక్షణకు అర్హత కలిగిన వారు 531 మందిని ఎంపిక చేస్తామని అన్నారు. ఈ ఎంపిక విభాగంలో ఏపీవో ఎస్ రమేష్, జాబ్ కోఆర్డినేటర్ బుజ్జన్న పరిశీలనలో తీసుకుని యువతి యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం జాబ్ రిసోర్స్ పర్సన్, పి శివప్రసాద్ శిక్షణ కేంద్రం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ గోవింద్ తీరుపై స్థానికుల మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ తీరుపై అధికార పార్టీ కార్యకర్తలే కాదు స్థానికులూ మండిపడుతున్నారు. తమ సమస్యల్ని పరిష్కరిస్తాడని ఓటేసి గెలిపిస్తే, వైసీపీని కాకుండా ఇతర పార్టీల పెద్దలకే మద్దతుగా ఉంటున్నాడని వారంతా మండిపడుతున్నారు. అందుకు కృష్ణాష్టమి వేదికగా గురువారం స్థానిక వినాయక ఆలయం వద్ద నిర్వహించిన పండుగ వనులే ఉదాహరణ అని గుర్తు చేస్తున్నారు. వినాయక ఆలయం వద్ద శ్రీ యశోద కృష్ణా సేవా సంఘం ఆధ్వర్యంలో గోవింద్ పండగ నిర్వహించారు. పార్టీలకతీతంగా నేతల్ని పిలిచినప్పటికీ ఆయా పార్టీల నేతలు వచ్చినప్పుడు మాత్రం కార్పొరేటర్ వ్యవహరించిన తీరు అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పండగ సందర్భంగా మేయర్, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు వంటి అతిథులు వచ్చారు. అయితే టీడీపీ నేత పల్లా శ్రీనివాసరావు అక్కడకు వచ్చిన సమయంలో స్థానిక టీడీపీ కార్యకర్తలంతా వెల్లువగా వచ్చారు. అదే వైసీపీ నేతలు వచ్చినప్పుడు మాత్రం కనీస సమాచారం లేకపోవడంతో స్థానికులంతా మండిపడుతున్నారు. ముఖ్యంగా తమ కాబోయే ఎమ్మెల్యే, ఆ నియోజక వర్గ ఇంచార్జి కేకే రాజు వచ్చినప్పుడు పార్టీ తరపున నలుగురు కూడా లేకపోవడానికి కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ వ్యవహరించిన తీరే కారణమని చెబుతున్నారు. కేకే రాజు రాకకు సంబంధించి కనీసం ఆయా సచివాలయాల కన్వీనర్లకు కూడా సమాచారం వెళ్లలేదని చెబుతున్నారు. దేవుడి కార్యక్రమానికి ఆహ్వానం పంపించిన కార్పొరేటర్..అధికార పార్టీ నేత వచ్చినప్పుడు మాత్రం పిలవకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే స్థానికులతో సఖ్యత కోల్పోయిన కార్పొరేటర్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇలా చేయడం ఏంటంటూ బూత్ కమిటీ కన్వీనర్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే తమ పార్టీ నేత కేకే రాజు దృష్టికి తీసుకు వెళ్లామని, గోవింద్ తీరు ఇప్పటికైనా మారకపోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపును వారి చేతిలో పెట్టేసినట్టేనని చెబుతున్నారు.

వెస్టర్న్ డిజిటల్ డబ్ల్యూడీబ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' ఎస్ఎస్డీ పరిచయం

విశాలాంధ్ర/విశాఖపట్నం: ప్రపంచంలో విజువల్ బ్రిలియెన్స్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్‌కు డిమాండ్ పెరుగుతుందని, అందుకు తగ్గట్టు సృజనాత్మక నిపుణుల కోసం వెస్టర్న్ డిజిటల్ డబ్ల్యూడీబ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' ఎస్ఎస్డీ పరిచయం చేస్తున్నట్లు వెస్టర్న్ డిజిటల్ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ సేల్స్ (ఇండియా) ఖలీద్ వానీ తెలిపారు. రిచ్ కంటెంట్ ఉత్పత్తి, వినియోగానికి మద్దతు ఇచ్చే అధునాతన సాంకేతికతలకు ఇది మార్గం సుగమం చేస్తోందన్నారు. వినియోగదారులు, విద్యార్థులు, నిపుణుల కోసం, వారి ఊహలను ప్రవహింప జేయడానికి వేగవంతమైన, నమ్మదగిన సాధనాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అవార్డు-విజేత ఎస్ఎస్డీ పోర్ట్‌ఫోలియో ఆధారంగా వెస్టర్న్ డిజిటలల్ డబ్ల్యూడీబ్లూ 'ఎస్ఎన్580 ఎన్వీఎంఈ' సాలిడ్ స్టేట్ డ్రైవ్ (ఎస్ఎస్డీ)ని విడుదల చేశామన్నారు. ఇది ఎన్వీఎంఈ పీసీఐఈ (ఆర్) జెన్ 4.0 అంతర్గత ఫ్లాష్‌డ్రైవ్ అనేది ప్రస్తుత పీసీలను అప్‌గ్రేడ్ చేసేటప్పుడు లేదా కస్టమ్ బిల్డ్‌ను ఎలివేట్ చేసేటప్పుడు సృజనాత్మక ఔత్సాహికుల సంఘం నిపుణుల కోసం ఉద్దేశించ బడిరదన్నారు. భారతదేశంలో లీనమయ్యే డిజిటల్ కంటెంట్‌కు డిమాండ్ పెరుగుతున్నందున, అధిక-పనితీరు గల సాధనాల అవసరం కూడా పెరుగుతుందన్నారు.

గొల్లగుంటలో కాలువలు నిర్మించరూ....

విశాలాంధ్ర - పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీ శివారు గొల్లగుంట గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో అపారిశుధ్యం తాండవి స్తుంది. గ్రామంలో 15ఏళ్ల క్రితం నిర్మించిన అరకొర కాలువలే దర్శనమిస్తాయి. అవి కూడా పూర్తిగా శిథిలమయ్యాయి. ప్రధానంగా గ్రామంలో ఉన్న మంచి నీటి బోరుల వద్ద అపారిశుధ్యం తాండ విస్తుంది. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికా రులు పాలకులు పత్తాలేకుండా పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో పూర్తి స్థాయి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం ఇళ్లలో వాడుక నీరు, మురుగు నీరు ఇళ్ల మధ్యలోనే ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు విషసర్పాలు సంచరిస్తుండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు దోమలు వృద్ధి చెంది, రాత్రులు పగలు అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో కంటిపై కునుకు లేకుండా పోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప గ్రామాన్ని పట్టించుకునే నాథుడు కరువయ్యారని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు గ్రామంపై దృష్టిసారించి పూర్తి స్థాయిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఎప్పటికప్పుడు ఇళ్ల మధ్య మురుగు నీరు లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి హామీ ఉద్యోగుల పనితీరు భేష్

విశాలాంధ్ర - హుకుంపేట: వలస కూలీల నిర్మూలన కోసం పకడ్బందీగా పనిచేయుచున్న ఉపాధి హామీ క్షేత్రస్థాయి సహాయ ఉద్యోగుల పని తీరు గిరిజన ప్రాంతంలో భేష్‌గా ఉన్నాయని వారి సేవలు వెలకట్టలేనిదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గొణ కొనియాడారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ క్షేత్రస్థాయి ఉద్యోగుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు , నీటి నిలువ గుంతలు, రాతి కట్టడాలు, సిల్వర్ తోటలు పెంపకం వంటి బృహత్తర కార్యక్రమాలు చేయించిన క్షేత్రస్థాయి సహాయకులు రాత్రి పగలు వర్షాలనను సైతం లెక్కచేయకుండా పని చేస్తున్నారన్నారు. ఉద్యోగుల అర్హతబట్టి సబ్ ప్లాన్ ద్వారా జీతాలు చెల్లించుట, ఇంటర్ విద్యార్హత ఉన్నవారికి టిఎలుగా, సీవోలుగా పదోన్నతి కల్పించుట, డిసిసి, ఎమ్ సిసి, ఎఫ్ టి ఈ లు మాదిరిగా రాయితీలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజబాబు, జడ్పిటిసి సభ్యులు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకట్రావు, సర్పంచులు వెంకటపూర్తిమ, సీదరి సాంబ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అడహక్ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - విశాఖ: భారత నాస్తిక సమాజం (భానాస) రాష్ట్ర అడహక్ కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తి ఎన్నికైనట్టు కేంద్ర కమిటీ కన్వీనర్ ఆర్.ఎస్.వి. మురళి వెల్లడించారు. ఈ మేరకు గురువారం అంబేద్కర్ భవన్‌లో మీడియాతో మురళి మాట్లాడుతూ ఇటీవల పౌర గ్రంథాలయంలో భానాస కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందన్నారు. 1972వ సంవత్సరంలో ఏర్పడ్డ భానాస.. 50 సంవత్సరాలకు పైగా సమాజంలోని మానవ హక్కులు కోసం, అంటరానితనం నిర్మూలన కోసం, స్త్రీ వివక్షకు వ్యతిరేకంగా, కుల, మత, మూఢ విశ్వాసాల నిర్మూలన, దేవుడి పేరుతో జరిగే దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడుతోందని వివరించారు. చంద్రయాన్ పేరుతో ఒక వైపు జాబిల్లిపైకి రాకెట్లను పంపిస్తున్న నేటి తరుణంలో, మరోవైపు అదే రాకెట్ నమూనాను తీసుకువెళ్లి తిరుపతి, చంగాలమ్మ గుళ్ళల్లో పూజలు చేయడం ప్రజలను మధ్య యుగాల నాటి ఆచార సాంప్రదాయాల వైపు తీసుకు వెళ్లడమేనని అన్నారు.

ఈ నేపథ్యంలో ఏడుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నామని వెల్లడించారు. రాష్ట్ర కన్వీనర్‌గా టి.శ్రీరామమూర్తితో పాటు కమిటీ సభ్యులుగా జె.శ్యామల, వీరబాబు, కె.విజయ కుమార్, మధుసూదన్, జి. వికాస్, శ్రీరామ్‌లు కేంద్ర కమిటీకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, చార్వాక, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలందించాలి

విశాలాంధ్ర - చింతపల్లి: మారుమూల గిరిజన గ్రామాల నుంచి ప్రసవానికి ఆసుపత్రికి తరలివచ్చే గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రత్యేక వైద్య సేవలు అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ అల్లూరి జిల్లా సమన్వయ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కిల్లు కృష్ణరావు అన్నారు. గురువారం వివిధ దిన పత్రికలలో మన్యం దైన్యం, ఆగని మాత శిశు మరణాలు అనే కథనాలకు స్పందించిన ఆయన గురువారం చింతపల్లి ఏరియా ఆసుపత్రిని సందర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి రోగులకు అందించవలసిన వైద్య సేవలపై సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు ప్రసవానికి ఆసుపత్రికి వస్తే వైద్యాధికారులతోపాటు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, సుఖ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. నిజానికి జంగం విమల కుమారి గత నెల 28న ఆస్పత్రిలో చేరిన రోజు రక్త పీడన (బీ పీ) 1.30 ఉండడంతో వైద్యాధికారులు చికిత్స అందించారన్నారు. మరసటి రోజున రక్త పీడన 1.80 నమోదు కావడంతో ఇంజక్షన్ చేసి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.

అక్కడ వైద్య అధికారులు గర్భిణి విమలకుమారిని పరీక్షించి, పరిస్థితి విషమించడంతో అత్యవసర పరిస్థితులలో మరింత మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. కడుపులో శిశువు మృతి చెందడంతో శిశువును బయటకు తీసి తల్లి ప్రాణాలను రక్షించేందుకు శతవిధాల ప్రయత్నించి నప్పటికీ విమల కుమారి ప్రాణాలు విడిచిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏరియా ఆసుపత్రి ఇన్చార్జి సూపరింటెండెంట్ సుధా శారద, వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొండయ్యవలసలో మల్టిపర్పస్ హాల్‌కి శంకుస్థాపన



విశాలాంధ్ర - గాజువాక: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస రామాలయం ప్రాంగణంలో 20 లక్షల రూపాయల వ్యయంతో మల్టిపర్పస్ హాల్ నిర్మాణానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ కొండయ్యవలస గ్రామ ప్రజలు చిరకాల వాంఛ మల్టిపర్పస్ హాల్ నిర్మాణమని అది నెరవేరుస్తున్నామని చెప్పారు. స్థానిక కొండయ్యవలస పాఠశాలకు పేస్- 1,పేస్-2 లలో నిధులు మంజూరు చేసి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అగనంపూడి ప్రాంత వాసులకు మంచినీటి అసౌకర్యం లేకుండా పూర్తి స్థాయిలో మంచినీటి సరఫరా కృషి చెయ్యడం జరిగిందన్నారు. త్వరలో అగనంపూడి పునరావాస కాలనీలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామని, 79,85 వార్డులకు అనుసంధానంగా ఉన్న అగనంపూడి ప్రాంత పుర ప్రజలు సౌకర్యంగా త్వరలో 60 సెంట్లు రైతు బజారు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు బలిరెడ్డి శ్రీను సభా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైస్సార్సీపీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి. పూర్ణ, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు పిల్లా కొండలరావు,ఐ.ఆర్. సి హెచ్ అప్పారావు, మరిశ రామచంద్రరావు విందుల వరహాలు, సాయన సన్యాసిరావు బుదిరెడ్డి అప్పారావు, వద్దాది శ్రీను, పిల్లా రవి, కన్నారావు, నవీన్, రాము, బొండా ఈశ్వరరావు, కొండయ్యవలస సచివాలయం కన్వీనర్‌లు పిల్లా సురేష్, బల్ల పైడిరాజు, దాసరి సత్యవేణి పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా గిరిజనులకు సేవలందించాలి

విశాలాంధ్ర - మారేడుమిల్లి: ఏజెన్సీలోని గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారము సకాలంలో వివిధ రకాలైన సేవలు గిరిజనులు అందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మారేడుమిల్లి మండలంలో ఆర్థిక శాఖ ఆర్. యం. యఫ్ పి. సి టీ.యస్.గుల్జార్, రాష్ట్ర ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.సునీల్ కుమార్ రెడ్డి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే, డీఎఫ్ఓ జి.జి.నరేంద్ర, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఇరువురు కలిసి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. ముందుగా మారేడు మిల్లి మండలంలోని సున్నంపాడు గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయ పరిధిలో గిరిజనులు వివిధ రకాలకు సంబంధించిన పథకాలకు దరఖాస్తులు చేసుకున్నా వాటిని వెంటనే పరిశీలించి వారి మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అగ్రికల్చర్ అధికారి. కె. చిట్టిబాబు, ఎంపీడీవో జయంతి, డిప్యూటీ తాసిల్దార్ బాలాజీ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తులు

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు గెస్ట్ లెక్చరర్ ప్రాతిపదికన నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జే.ఎలిజబెత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ నందు ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. వివరాలకు 8500356997ను సంప్రదించాలన్నారు.

పేకాట ఆడుతున్న ముగ్గురు అరెస్టు

విశాలాంధ్ర - మాకవరపాలెం: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని మామిడిపాలెం శివారున పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15040 నగదును స్వాదీనం చేసుకున్నామని తెలిపారు.

భారీ వర్షానికి నేల కూలిన నివాస గృహాలు

విశాలాంధ్ర - చింతపల్లి: అల్పపీడన ప్రభావంతో కుంభవృష్టిగా కురిసిన వర్షానికి రెండు నివాస గృహాలు నేల కూలి రెండు గిరిజన కుటుంబాలు నిరాశ్రయులైన సంఘటన కుడుము సారి పంచాయతీలో చోటు చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన కుంభ వృష్టి వర్షానికి మండలంలోని కుడుము సారి పంచాయతీ పరిధిలోని మండిపల్లి, కోట గున్నల గ్రామాలకు చెందిన సాగిన సన్యాసమ్మ, పాంగి నారాయణమ్మల నివాస గృహాలు నేలమట్టం అయ్యాయి.. దీంతో ఆ కుటుంబ సభ్యులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సామాగ్రి తడిసి ముద్ద అయింది. రాష్ట్ర ప్రభుత్వం, పాలకులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు.

పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ సర్పంచ్ ముచ్చిక నాగార్జున ఆధ్వర్యంలో కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. మామిళ్ళగూడెం సాయికుమార్ అనే యువకుడికి వికలాంగుల మూడు చక్రాల వాహనం పంపిణీ చేశారు. మొదటగా ఎంపీడీవో ఆఫీస్ మండల కేంద్రంలో 324 పెన్షన్లు, 11 మంది వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు అర్హులైన వారికి ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమల, జెడ్పీటీసీ మురళి, వైస్ ఎంపీపీ చిన్ని, మండల కన్వీనర్ రామలింగారెడ్డి, కృష్ణ, ఎంపీడీవో వెంకటరత్నం, ఎమ్మార్వో సుబ్బారావు, ఇన్చార్జ్ సెక్రెటరీ రఘుబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మణ్, వాలంటరీ జయలక్ష్మి, రాంబాబు, బాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ

విశాలాంధ్ర - చీడికాడ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు టిడిపి జిల్లా మాజీ అధ్యక్షుడు గవిరెడ్డి రామనాయుడు మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ పథకాలు చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, కార్యదర్శి బొబ్బది తాతారావు, సర్పంచ్ సూరినాయుడు, ఎంపీటీసీ బీలా కోటి, పంచాడ దాలినాయుడు, అప్పారావు, కొల్లి పైడినాయుడు, ధర్మయ్య, నాయుడు, గణేష్, శివ, చినఅప్పారావు, పాత్రుని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన గ్రామ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రమైన మునగపాక జనసేన పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా సూరిశెట్టి అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సిహెచ్ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆడారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా పెంటకోట సంతోష్, ట్రెజరర్ మద్దాల సాయి, కార్యవర్గ సభ్యులుగా కారుకొండ రాజు, తట్టా అశోక్, పి.ఉమామహేశ్వరరావు, కే.కేదార్, బి.సురేంద్ర, ఎస్.కిషోర్, టి.సుధీర్, టి.మోహిత్, టి.కిషోర్, లక్ష్మణ్ ఎన్నుకున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో గాంధీనగర్ కాలనీ అంగన్వాడి సెంటర్లో గురువారం నిర్వహించిన పోషణ మహా అనే కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ సూర్య లక్ష్మి, సీడీపీఓ ఝాన్సీ రాణి మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సంప్రాప్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంబాబు ఎంపీటీసీ విజయ కుమారి, సూపర్వైజర్లు, కొండమ్మ, సత్య సుజాత, విజయ కుమారి, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు వెంకట్ లక్ష్మి, చంద్రమణి, సింహాచలం, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కుషాక్, స్లావియా యొక్క కొత్త వేరియంట్లతో స్కోడా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో అత్యంత సురక్షితమైన, అత్యధిక రేటింగ్ పొందిన, క్రాస్-టెస్టెడ్ కార్ల తయారీదారులైన స్కోడా ఆటో ఇండియా, కుషాక్ ఒనిక్స్ ప్లస్ మరియు స్లావియా యాంబిషన్ ప్లస్లతో రెండు కొత్త ఉత్పత్తి వేరియంట్లను ప్రకటించింది. రెండు వేరియంట్లు పండుగ ధర, ఆకర్షణీయమైన కొత్త ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు మరియు ప్రత్యేక కార్పొరేట్ ప్లాన్లను కలిగి ఉంటాయి. అన్నీ పరిమిత కాలానికి మాత్రమే. కుషాక్ ఒనిక్స్ ప్లస్ అన్ని కొత్త 8.16 గ్రస్ అల్లాయ్ లను మరియు విండో క్రోమ్ గార్నిషను కలిగి ఉంది. ఫ్రంట్ గ్రిల్ రిబ్స్ మరియు వెనుక ట్రంక్ గార్నిష్ ఇప్పుడు క్రోమ్లో ఫినిషింగ్ పూర్తి చేసుకున్నాయి. కుషాక్ ఒనిక్స్ ఫస్ ధర రూ 11.594 లక్షలు మరియు ప్రత్యేకంగా క్యాండీ వైట్ మరియు కార్బన్ స్టీల్ రంగులలో అందుబాటులో ఉంటుంది.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బాల బాలికలు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో, నృత్య ప్రదర్శనలతో అలరించారు. వైభవంగా జరిగిన ఉట్టి ఉత్సవంలో బాలకృష్ణులు, గోపికలు పాల్గొని ఆనందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వి.తారకేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ మహావిష్ణువు బ్రహ్మాండాన్ని ఉద్ధరించడానికి హిందూ ఇతిహాసంలో ఎనిమిదవ అవతారం శ్రీ కృష్ణావతారం అని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని శ్రీ కృష్ణాష్టమి అని శ్రీకృష్ణ జన్మాష్టమి అని గోకులఅష్టమని అని కూడా అంటారని తెలిపారు. తల్లులకు బాలకృష్ణునిగా స్త్రీలకు గోపిక వల్లభునిగా పెద్దలకు గీతాకారునిగా ఇలా ప్రతి ఒక్కరి మదిలోను కొలువై ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎస్‌వి గోవిందరావు, సి బ్యాచ్ ఇంచార్జ్ ఎం.ఆర్.వి శేషగిరి, అసిస్టెంట్ డీన్ హాఫషా, ప్రైమరీ ఇన్చార్జ్ ఎస్.రాజలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ టి.శోభ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం గొన్న కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్ని కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. వెన్న కుండలతో విద్యార్థుల హడావిడి ముచ్చట గొలిపింది. పిల్లన గ్రోవితో విద్యార్థుల ఆటా పాటా అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టి కన్నయ్యలు, చిన్నారి గోపికలు వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ఆవరణ అంతటా బృందావనాన్ని మైమరిపించేలా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా రాధాకృష్ణుల ప్రతిమలకు ఉయ్యాలలూపి వేడుకను ప్రారంభించారు. పాఠశాలలో ఉట్టిమహోత్సవంలో భాగంగా ఉట్టిని కొట్టేందుకు పాఠశాల చిన్నారులు ఎంతో పోటీపడ్డారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పిందని ,కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఈ కృష్ణాష్టమి అని ,దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేసిన కృష్ణభగవానుడు మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన అని తెలియజేస్తూ రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యం.యెస్.మణి కృష్ణాష్టమి శుభాకాంక్షలను తెలియజేసారు. భాగవతం మన సంస్కృతి సాంప్రదాయాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ వేడుకలు అద్దం పడతాయని తెలుపుతూ, చిన్నారులకు చిలిపికృష్ణుడుగా, తల్లుల కు బాలకృష్ణుడుగా,పెద్దలకు గీతాకారునిగా శ్రీకృష్ణుడు మనందరికీ ధర్మ సందేశాన్ని అందించారని ఉత్తరాంధ్ర రవీంద్రభారతి పాఠశాలల ఇన్చార్జ్ ఎన్.వెంకటేష్ తెలిపారు. ద్వాపరయుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తాయి ఏజీఎం జి వి ఎస్ ఎన్ మూర్తి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.జగదీష్.అన్నారు విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు శ్రీకృష్ణుని చెరసాలలో జననం అనే నాటక ఘట్టం, శ్రీకృష్ణుని బాల్య క్రీడలు ఎంతో కనువిందు చేసాయి. ఇంత గొప్ప వేడుకను నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులు,తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీడికాడ: మాడుగుల నియోజకవర్గ చీడికాడ మండలం అప్పలరాజు పురం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరుగుతున్న వేడుకల్లో మాడుగుల నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు రాయపరెడ్డి కృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయాల్లో ఉన్న దేవతలను దర్శించుకుని అన్న సమారాధనలో ప్రజలతో కలిసి భోజనం చేయడం జరిగింది రాయపురెడ్డి కృష్ణ గారితో పాటు మజ్జి కృష్ణ, కుంచ అంజి, యాళ్ల ప్రసాద్, బయశెట్టి సత్తిబాబు, కశింకోట సంతోష్ పాల్గొన్నారు.

గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు పాత గోపాలపట్నం శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో 92 వ వార్డు నందమూరి నగర్ శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర ఆలయంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పంచమ రాత్రి మహోత్సవముల సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఏపి.ఎమ్.ఎస్.ఎమ్.ఇ.డిసి చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో, కృష్ణాపురం గోశాల లోను పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం జన్మాష్టమి వేడుకలు జరిగాయి. సింహాద్రి అప్పన్న ఆలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి.

ఆనందపురం: రవీంద్ర భారతి పాఠశాల వెల్లంకి గ్రామపంచాయతీ పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిట్టి కన్నయ్యలు,చిన్నారి గోపికలు వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ఆవరణ అంతటా

బృందావనాన్ని మైమరిపించేలా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా రాధాకృష్ణుల ప్రతిమలకు ఉయ్యాలలూపి వేడుకను ప్రారంభించారు. పాఠశాలలో ఉట్టిమహోత్సవంలో భాగంగా ఉట్టిని కొట్టేందుకు పాఠశాల చిన్నారులు ఎంతో పోటీపడ్దారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పిందని ,కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఈ కృష్ణాష్టమి అని ,దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశనిర్దేశం చేసిన కృష్ణభగవానుడు మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన అని తెలియజేస్తూ రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ యం.యెస్.మణి కృష్ణాష్టమి శుభాకాంక్షలను తెలియజేసారు.భాగవతం మన సంస్కృతి సాంప్రదాయాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ వేడుకలు అద్దం పడతాయని తెలుపుతూ, చిన్నారులకు చిలిపికృష్ణుడుగా, తల్లుల కు బాలకృష్ణుడుగా,పెద్దలకు గీతాకారునిగా శ్రీకృష్ణుడు మనందరికీ ధర్మ సందేశాన్ని అందించారని ఉత్తరాంధ్ర రవీంద్రభారతి పాఠశాలల ఇన్చార్జ్ ఎన్.వెంకటేష్ తెలిపారు. ద్వాపరయుగంలో జన్మించిన కృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకే ఆయన్ను అందరూ తమ ఇష్టదైవంగా కొలుస్తున్నారు. వివిధ రూపాల్లో, సంప్రదాయాలతో భక్తిప్రపత్తులతో కృష్ణుడిని కొలుస్తున్న ఆయా రాష్ట్రాల వారి సంప్రదాయాలు మన భారతీయ సంస్కృతిమన భారతీయ సంస్కృతికి విలక్షణమైన అందాన్ని తెస్తాయి అని పాఠశాల ప్రిన్సిపాల్ అన్నారు .విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు శ్రీకృష్ణుని చెరసాలలో జననం అనే నాటక ఘట్టం, శ్రీకృష్ణుని బాల్య క్రీడలు ఎంతో కనువిందు చేసాయి. ఇంత గొప్ప వేడుకను నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి విద్యార్థులు,తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: పాయకరావుపేటలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బృందావనం కాలనీలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, ఉట్టికొట్టడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వికాస్ తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు తదితరులు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే కృష్ణ వీధి లోని శ్రీకృష్ణుడు ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, జూరెడ్డి ప్రసాద్, మల్లిపెద్ది వెంకటరమణ, వేములపూడి అప్పారావు, గంపల చినరాజు చిరుకూరి పేర్రాజు, ఏడిద సురేష్, బోడపాటి శ్రీను, దువ్వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌పై మహిళల ఆగ్రహం

విశాలాంధ్ర- మారేడుమిల్లి: వై.రామవరం మండలం పాతకోట గ్రామ సచివాలయంలో 45 సంవత్సరాలు దాటిన మహిళలకు వైయస్సార్ చేయూత పథకానికి అర్హులు కారని చెప్పడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే పంచాయతీలోని 45 సంవత్సరాలు దాటిన మహిళలు చేయూత కోసం దరఖాస్తు చేయడానికి వెళ్ళగా సచివాలయం సిబ్బంది తగిన ధ్రువపత్రాలు లేవని పలుమార్లు చెప్పారని, తీరా అవసరమైన పత్రాలు తీసుకువెళ్లి ఇవ్వగా మీకు ఈ పథకం వర్తించదని మీరు ఉద్యోగస్తులుగా పరిమించబడతారని దరఖాస్తు చేసుకుని చివరి రోజున చెప్పడం బాధాకరమని మహిళల ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లమైన మేము పర్మినెంట్ ఉద్యోగులం కాదని మాకు 4,500 నుండి 6500 రూపాయలు మాత్రమే జీతాలు వస్తాయని, ప్రభుత్వం నెలకు పదివేల రూపాయలు ఆదాయం ఉన్నంతవరకు అర్హులని చెప్పిన సచివాల సిబ్బంది నా దరఖాస్తు తిరస్కరించడం బాధాకరమని, పథకం యొక్క తేదీని పెంచారని తెలిసి డిజిటల్ అసిస్టెంట్ కి ఫోన్ చేస్తే రాంగ్ నెంబర్

అని ఫోన్ కట్ చేయటం వంటివి చేశారని, ఇదే మొదటిసారి కాదని ఇలా ఎన్నోసార్లు ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తున్న పాతకోట డిజిటల్ అసిస్టెంట్ విజయ్ పై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడుతూరి వరమని, ధూమంతి విమల కుమారి, గొర్లి జ్ఞానాభాయ్, రావడి కమలమ్మ, గుత్తం లక్ష్మి, సుంకరి కాసు లమ్మ, డ్వాక్రా మహిళలు, మినీ అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు

రోడ్డును తవ్వారు....రోడ్డు నిర్మాణం మరిచారు...

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి, కుందులూరు మీదుగా నరసింగపేట వెళ్లే ప్రధాన రహదారి రోడ్డును నాలుగు సంవత్సరాల క్రితం ఆర్భాటంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు శంకుస్థాపన చేసినా ఇంతవరకు రోడ్డు పనులు మొదలు పెట్టలేదని, శంకుస్థాపనలే తప్ప పనులు కావా ? మీ ప్రభుత్వంలో అని సిపిఎం మండల కమిటీ నాయకులు విమర్శించారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం మండల పార్టీ కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ దీనికి తోడు ఉన్న రోడ్డు మొత్తం తవ్వి వదిలేసిన కారణంగా అటువైపుగా ప్రయాణికులే కాక కనీసం 108, 104 కూడా తిరగలేని పరిస్థితి దాపురించిందని, కనీసం ఆటోలు కూడా తిరిగే పరిస్థితి లేదని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆరోపించారు. కుందు లూరు, టేకులూరు, గుల్లేటి వాడ, ముల్కన పల్లి, కుంజువారిగూడెం, తెల్లం వారి గూడెం గ్రామాలకు మండల కేంద్రం 20 కిలోమీటర్ల దూరంలో ఉందని తహశీల్దార్ కార్యాలయానికి, బ్యాంకులకు నిత్యవసర సరుకులకు, ఆసుపత్రులకు రావాలంటే ఏ వాహనాలు కూడా అటువైపు తిరగట్లేదని ఎమ్మెల్యేకి, ఎంఎల్‌సికి గిరిజనులు, గిరిజన గ్రామాలు

అంటే ఇంత నిర్లక్ష్యం ఎందుకు ?అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వడ్లాది, రమేష్, గుండుపూడి లక్ష్మణరావు, పంకు, సత్తిబాబు, సోడి మల్లయ్య, ప్రకాష్, శీరపు తాత బాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ

విశాలాంధ్ర - సీలేరు: దేశ చరిత్రలోనే మహాత్మ గాంధీ కలలగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకేవీధి మండలం ధారకొండ గ్రామ సచివాలయం పరిధిలోని కొంగపాకలు, వర్తండపాడు, పెంటల గెడ్డ, డి.కొత్తూరు, కమ్మరి తోట, చీడిగుంట, తోకరాయి, భీములు పాకలు గ్రామాలలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 325 గడపలను సందర్శించారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగతంగా అందించిన సాయాన్ని గణాంకాలతో సహా వివరించారు. గ్రామాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఏ సంక్షేమ పథకం ద్వారా ఎంతెంత లబ్ది చేకూరుతుందన్న విషయంపై అవగాహన కల్పించారు. ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జగనన్న ప్రవేశపెట్టారని తెలిపారు. గెలిపించిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు. సీఎం జగన్ అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాల అర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు గ్రామాల్లోని అందిస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీ ఉదయాన్నే వాలంటీర్లు తలుపు తట్టి అవ్వతాతలు, వితంతువు, దివ్యాంగులకు ఫించన్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో టీడీపి సానుభూతిపరులకు, జన్మభూమి కమిటీ ఇచ్చిన వారికే పథకాలు అందించాయని గుర్తు చేశారు. గ్రామాల్లో తక్షణ పరిష్కరించాల్సిన సమస్యల కోసం గిరిజన ప్రాంతంలో ప్రతి సచివాలయానికి ప్రభుత్వం రూ.40 లక్షల మంజూరు చేస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోయిన కుమారి, వైస్ ఎంపిపిలు సప్పగడ్డ ఆనంద్, లోత దేవుడు, దారకొండ సర్పంచ్ నడిగొట్ల రాజు, ఎంపిటిసి ఎం.రమణ, బిసి సెల్ అధ్యక్షులు పిల్లా బుజ్జి, సర్పంచ్‌లు కుందారి రామకఅప్ప, ఎం.కమలమ్మ, జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపిటిసి పసుపులేటి నాగమణి, మాజీ వైస్ ఎంపిపి శెట్టి కాసులమ్మ, నాయకులు రెడ్డి మోహన్ రావు, రామారావు, కె.ప్రసాద్, కోడా గోపాల్, బివి.చిట్టిబాబు, కోడా గాని కిల్లో శ్రీను, సప్పాల ఈశ్వరరావు, రౌతుల రాంబాబు, తాంగుల మోహన్, లోవరాజు, వార్డు మెంబర్లు గొల్లోరి మణి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారబంధాల చంద్రయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం జరపాలి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రంప పితూరీకి ఆద్యుడు, తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ద్వారబంధాల రామచంద్రయ్య జయంతి సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతా అధికారికంగా జరపాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాటానికి 50 సంవత్సరాలు ముందే ఏజెన్సీలో గిరిజనుల కోసం, అణగారిన పేద వర్గాల కోసం బ్రిటీష్ సామ్రాజవాదులపై, జమీందారీ వ్యవస్థపై ద్వారబంధాల చంద్రయ్య పోరాటం చేశాడని, 1922లో అల్లూరి దాడి చేసిన అడ్డతీగల పోలీస్ స్టేషన్ పై 1979లోనే చంద్రయ్య దాడి చేశాడని, రంప పితురీగా 1874 నుండి 1880 వరకు సాగిన ఈయన పోరాటం అప్పట్లో నాలుగైదు జిల్లాల్లో సాగిందని, ఈయన అల్లూరి సీతారామరాజు పోరాడిన రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, కొయ్యూరు, మంప, పాడేరు, గొలుగొండ ప్రాంతాలతోపాటు భద్రాచలం, చింతూరు, కూనవరం, రేకపల్లి, విఆర్ పురం, కిర్లంపూడి తదితర ప్రాంతాల్లో సాయుధ పోరాటాలు సాగించాడు. చంద్రయ్య కర్ర సాము, కత్తి పోరాటాల్లో, తుపాకీ కాల్పుల్లో, గుర్రపు స్వారీలో ఆరితేరిన యోధుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు కూడా చంద్రయ్యనే స్ఫూర్తిగా తీసుకొని ఆయన పోరాడిన ప్రాంతాల్లోనే సీతారామరాజు కూడా పోరాటాలు సాగించారని, అందువల్ల చంద్రయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతా అధికారికంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే గిరిజన సంక్షేమ శాఖ ముందుకు వచ్చి చంద్రయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన పోరాటం సాగించిన ప్రాంతమైన రాజవొమ్మంగి మండలం శరభవరంలో చంద్రయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల పడాల వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మోటో జీ 54 5జీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశములోని ఉత్తమ 5జి స్మార్ట్?ఫోన్స్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు తన విభాగములోఅత్యంత శక్తివంతమైన 5జి స్మార్ట్?ఫోన్ అయిన మోటో జి 54 5జి ఆవిష్కరించినట్టు వెల్లడించింది. ఈ నూతన ఉత్పత్తితో 5జి స్మార్ట్?ఫోన్ మార్కెట్ లో సంచలనం నమోదు చేస్తామని ఆ సంస్థ ప్రతినిధి అన్నారు. మోటో జి 54, భారీ బిల్ట్-ఇన్ 12జిబి రామ్ ప్లస్ 256జిబి 5జి స్టోరేజ్, అత్యంత శక్తివంతమైన మీడియాటెక్ డైమెన్సిటి 7020 ఆక్టో-కోర్ ప్రాసెసర్, విభాగములో ప్రముఖ భారీ 6000 ఎం ఏ హెచ్ బ్యాటరీని కేవలం 19 వేల రూపాయలకు సుమారు అందిస్తున్నట్టు చెప్పారు. విభాగములో మొదటి 50ఎంపి షేక్ ఫ్రీకెమెరాతో ఒక 8జిబి ప్లస్ 128జిబ్ వేరియంట్ ను కేవలం 15,999 (రూ.14,499 ఆఫర్స్ తో) తీసుకొనివచ్చి సబ్-20కే విభాగములోని అన్నినిబంధనలను చేదించామని వివరించారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



విశాలాంధ్ర - చింతపల్లి :- స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉండాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విజయవాడ లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో స్వచ్ఛంద చైర్పర్సన్ పొనక దేవసేనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు, డైరెక్టర్లతో ఆమె సుదీర్ఘంగా చర్చించారనీ, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్క డైరెక్టర్ కృషి చేయాలని చైర్ పర్సన్ దేవసేనమ్మ, ఎండి గంధం చంద్రుడు సూచించారని ఈ క్రమంలో డైరెక్టర్లు వారి దృష్టికి స్వచ్ఛంద ప్రదేశ్ కు తీసుకోవలసిన చర్యలపై వారితో చర్చించడం జరిగిందని స్పందించిన చైర్ పర్సన్ దేవసేనమ్మ మరుగుదొడ్ల కల్పనకు తీసుకోవలసిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎండి గంధం చంద్రుడుని ఆదేశించారన్నారు. ఈ క్రమంలో అరకు నియోజకవర్గానికి 30, పాడేరు నియోజకవర్గం కు 22 మరుగుదొడ్లు మంజూరు చేయడం జరిగిందని డైరెక్టర్ మీరా తెలిపారు.

ఓటరు సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా ఓటరు సవరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫారం 8 సేకరణ, వంద సంవత్సరాలపై బడిన ఓటర్లు గుర్తింపు, ఒకే ఇంట్లో 10 మంది ఓటర్లు ఉన్న ఓటర్లు వరిశీలన, జీరో డోరు నెంబర్ల ఇళ్లపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సేకరించిన ఫారం 6, 7, 8లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సచివాలయం సిబ్బంది సేవలను వినియోగించు కోవాలని సూచించారు. ఓటరు జాబితా రూప కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పిఓ వి. అభిషేక్,రంప చోడవరం ఐటిడి ఏ పిఓ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పాడేరు, అరకువ్యాలీ, రంపచోడవరం తాహాశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తాహాశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

నిండా నీట మునిగిన చోడవరం

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ గురువారం పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను రక్షించేందుకు అధికారులకు సలహాలు సూచనలు చేశారు. కాగా చోడవరం పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెల్లివీధి, బానయ్య కోనేరు, బాలాజీ నగర్ ద్వారకానగరం తదితర ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురయ్యాయి. నీటి ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి మురికి నీరు రావడంతో సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీనివాస్ ఇంటితో సహా పలు కుటుంబాల వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసి కాంప్లెక్స్ తో బాటు పలుచోట్ల దుకాణదారులు పబ్లిక్ డ్రైనేజీ ల పై కట్టడాలు, పలకలు వేయడంతో వాన నీరు రోడ్లపై పొంగి పొర్లడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఆక్రమణలు, పలకలు తొలగిస్తే వాన నీరు సునాయాసంగా పోగలదు అని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ పంచాయతీ అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలకు ధైర్యాన్ని నింపారు. వానలు, వరదలు నుండి ప్రజలను రక్షించేందుకు అధికారులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, అత్యవసర సమయాల్లో 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీనివాస్, జ్యోతుల రమేష్, ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

అనంతబాబు సభలో గిరిజనులు అన్నం లేక అలమటించారు

విశాలాంధ్ర - వి. ఆర్. పురం: అనంతబాబు సభలో అమాయక గిరిజనులు,కొండ రెడ్లు అన్నం లేక అలమటించారు అని మండల జడ్పిటిసి సభ్యులు వాళ్ళ రంగారెడ్డి, జీడిగుప్ప ఎంపీటీసీ సభ్యులు వాళ్ళ వెంకటేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు..మంగళవారం రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్యే ధనలక్ష్మి , ఎమ్మెల్సీ అనంతబాబు ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు కొండల నుండి గుట్టల నుండి సుమారు 25 కిలోమీటర్ల మేరకు నాటు పడవల పై ఉప్పొంగుతున్న గోదావరి నదిలో దాటించి మరి వందల సంఖ్యలో అమాయక కొండారెడ్డి లను గిరిజనులు రావాలని ప్రభుత్వ అధికారులు హుకుం జారీ చేశారు. నిర్వాసిత ప్రజలను స్థానిక అధికారులు, మండల అధికారులు తరలించారు. తరలించడం బాగానే ఉన్నా ఉదయం ఆరు గంటలకు ఏమి తినకుండా వచ్చిన నిర్వాసిత ప్రజలకు ఉదయం టిఫిన్ పెట్ట లేదు మధ్యాహ్నం భోజనం అయిన పెడతారేమో అని ఆకలితో ఎదురుచూసిన భోజనం పెట్టె నాధుడు లేడని అన్నారు. అధికారులు వైసిపి నాయకులు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో కడుపునిండా తిని సుమారు రెండు గంటల ముప్పై నిమిషాలకు సభ ప్రాంగణంలో కి వచ్చారనీ. ఈ సభ ముగించే వరకు సాయంకాలం వరకు ప్రజలు ఏమీ తినకుండా సభలో ఉండవలసిన పరిస్థితి నెలకొంది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.జగనన్న ప్రభుత్వం ఇంటి ముందుకే పరిపాలన అని పదేపదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పుతుంటే ఈ అధికారులు, ఎమ్మెల్యే ధనలక్ష్మి ,ఎమ్మెల్సీ అనంత బాబు గుట్ట నుంచి మెట్టల నుంచి వాగులు వంకలు దాటుకొని గోదావరి నదిలో ప్రయాణం చేయించి మరి తరలించి సభ పెట్టారు అని రేఖాపల్లి మండలకేంద్రానికి రావటానికి ఒక్కో మనిషికి 300 రూపాయలు ఖర్చు అవుతుందని ఆ డబ్బులు ఎవరిస్తారు అని వారు ప్రశ్నించారు.